

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మంగళ వారం బంజారాహిల్స్ రోడ్ నం.14లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తమ కుటుంబ సభ్యుల వివరాలను ఎన్యూమరేటర్లకు అందజేశారు. - బంజారాహిల్స్


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 13 నవంబర్ 2024 | HYDERABAD







• ప్రభుత్వాన్ని నిలదీస్తాం



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అంగీకారంతో భూములు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీకి 300 ఫీట్ల రోడ్డు అవసరమా అని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులు కందుకూరు మండల పరిధిలోని అగర్‌మియగూడ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎకరా రూ.4 కోట్లు ధర పలుకుతుంటే.. రూ.19లక్షలు నష్టపరిహారం ఇస్తామనడం న్యాయమా అన్నారు. చట్టంలో మార్పు తీసుకొచ్చి రైతులకు మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరగకుంటే ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. సొంత నియోజకవర్గంలో రైతులకు న్యాయం చేయలేని ముఖ్యమంత్రి రాష్ట్ర రైతులకు ఏం న్యాయం చేస్తాడన్నారు. రైతుల కోసం న్యాయం పోరాటం చేస్తామని చెప్పారు.

# బడ్జెట్‌పై కసరత్తేదీ?

## జీహెచ్‌ఎంసీ వార్షిక బడ్జెట్ అంచనాపై ప్రతిపాదనలు సమర్పించని శాఖలు

## జనవరి రెండో వారంలోపు ఆమోదం పొందడం కష్టమే

సిటీబ్యూరో, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో పాలన గాడి తప్పిందని అనడానికి ఇదో మచ్చుతునక మాత్రమే. ఆర్థిక సంక్షోభం పేరుతో కొత్త ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించని యంత్రాంగం... పాలన వ్యవహారాల్లోనూ అదే నిర్లిప్తతను వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 11 నెలల వ్యవధిలో ముగ్గురు కమిషనర్లు మారడం, సాధారణ బదిలీలతో అదనపు కమిషనర్లు కొత్తగా రావడం, పాలనను సమర్థవంతంగా నడిపించే నాయకత్వం కొరవడటం వెరసి.. ప్రజాసమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సైతం పరిష్కరించలేని పరిస్థితి. ఇప్పటి దాకా మొత్తం ప్రజావాణిలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్నింటికి పరిష్కారం చూపారు? అన్న నివేదికను వెల్లడించకపోవడం అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నది. ఈ క్రమంలోనే ప్రతి ఏటా రూపొందించే వార్షిక బడ్జెట్‌పై పట్టింపులేని ధోరణి అవలంభిస్తున్నది. గత అక్టోబర్‌లోనే 2025-26 బడ్జెట్ రూపకల్పనపై దృష్టి సారించాల్సిన ఫైనాన్స్ విభాగం నవంబర్ వచ్చినా గ్రేటర్ బడ్జెట్ పై అంచనాల కసరత్తును ప్రారంభించకపోగా మల్లగుల్లాలు పడుతున్నది. ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం, కమిషనర్ ఇలంబరితి ఝార్ఖండ్ ఎన్నికల పరిశీలకులుగా ఉండటం, ఈ నెల 23తర్వాతే తిరిగి హైదరాబాద్‌కు వచ్చే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇంజినీరింగ్, అడ్వర్‌టైజ్ విభాగం, రవాణా, యూబీడీ, హెల్త్ వంటి విభాగాల నుంచి ప్రతిపాదనలు జీహెచ్‌ఎంసీ ఫైనాన్స్ విభాగానికి చేరలేదని తెలుస్తోంది. నిర్ణీత వ్యవధిలో బడ్జెట్ రూపకల్పన, ఆమోదం ఈ క్రమంలోనే వచ్చే ఏడాది జనవరి 10లోపు బడ్జెట్ ఆమోదం పొందడం కష్టసాధ్యమేనని అధికారులు భావిస్తున్నారు.




### ప్రారంభం కాని బడ్జెట్ ప్రతిపాదనలు..

వాస్తవానికి అక్టోబర్‌లోనే బడ్జెట్ అంచనాలు రూపకల్పనపై కసరత్తును ప్రారంభించాలి. జీహెచ్‌ఎంసీ చట్టం -1955 ప్రకారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను ఈ నెలలో ఏ తేదీ తర్వాత బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలపై కమిషనర్ నుంచి వివరణాత్మక సమాచారం స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉంది. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చట్టం పేర్కొంటుంది. వచ్చే ఏడాది జనవరి 10 లోపు జనరల్‌బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా కనబడుతున్నాయి. కొన్ని శాఖల ఆర్థిక విభాగానికి ప్రతిపాదనలు సమర్పించలేదు. బడ్జెట్ ప్రతిపాదనకు తొలుత స్టాండింగ్ కమిటీలో అనుమతి పొందాలి. కమిషనర్ వచ్చిన తర్వాతే స్టాండింగ్ కమిటీ సమావేశం ఉంటుంది. బడ్జెట్‌పై మార్పులు, చేర్పులు, అనంతరం స్టాండింగ్ కమిటీ ఆమోదానికి కనీసం 20 రోజుల సమయం తీసుకోనుంది. ఆ తర్వాత జనరల్ బాడి సమావేశం తేదీని ప్రకటించడం, కనీసం 15 రోజుల ముందు కార్పొరేటర్ సభ్యులకు బడ్జెట్ ప్రతిపాదనలను అందజేయాల్సి ఉంటుంది. జనరల్ బాడి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడం, సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మళ్లీ అవసరమైన మార్పులు, చేర్పుల అనంతరం బడ్జెట్ అనుమతికి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. దీంతో వచ్చే జనవరి రెండో వారం లోపు బడ్జెట్ ఖరారు అయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. హౌసింగ్, జీహెచ్‌ఎంసీ బడ్జెట్ కలిపితే కొన్నేండ్లుగా పెరుగుతూ వస్తున్నది. 2021-22లో బడ్జెట్ అంచనాలు రూ.5600 కోట్లు, 2022-23లో బడ్జెట్ అంచనాలు రూ. 6,150 కోట్లు, 2023-24లో బడ్జెట్ అంచనాలు రూ. 6,224 కోట్లు, 2024-25లో రూ. 7,937 కోట్లు అంచనాతో బడ్జెట్ రూపొందించింది. అయితే 2025-26 వార్షిక బడ్జెట్ అంచనాలు దాదాపు రూ. 8500 కోట్ల వరకు ఉండే అవకాశాలు కనబడుతున్నాయని చర్చ జరుగుతున్నది.


# షాడో నేతలపై చర్చ

## తోలుబొమ్మలుగా హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు

### పైరవీలపై కింది స్థాయి సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారుల అసహనం

### షాడో నేత చెబితేనే ఫైళ్లు ముందుకు..

సిటీబ్యూరో, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ) : షాడో నేతల వ్యవహారంపై హెచ్‌ఎండీఏలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న పైరవీలపై కింది స్థాయి సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పనులు జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బందిని నియంత్రించడంపై హెచ్‌ఎండీఏ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎంఏయూడీలో కీలక బాధ్యతలు తీసుకున్న ఉన్నతాధికారి, ఇటీవల హెచ్‌ఎండీఏకు వచ్చిన మరో అధికారి వ్యవహారమే క్షేత్రస్థాయి సిబ్బందిని మరింత కలవరపెడుతోందని ఆవేదన చెందుతున్నారు. హెచ్‌ఎండీఏలోని కొందరు డైరెక్టర్లు, ఇంజినీరింగ్ ముఖ్య అధికారుల సాయంతో సదరు ఎంఏయూడీ అధికారి ఆడింది ఆటగా మారిందనే ఆరోపణలు ఉండగా, దానికి హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి కూడా వంత పాడుతున్నారని సమాచారం. ఇటీవల డెవలప్‌మెంట్ పనుల వ్యవహారంలో కూడా షాడో నేత కలుగజేసుకుని, ఎంఏయూడీ ఉన్నతాధికారి సాయంతో ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిసింది. కొన్ని నిబంధనలను షాడో నేతల అనుమాయులకు అనుకూలంగా ఉండటంతో టెండర్ దక్కించుకోవడానికి సాయపడినట్లు హెచ్‌ఎండీఏలో చర్చ నడుస్తోంది. మొదటి నుంచి ఇంజినీరింగ్ విభాగంలో ఉండే ఓ ఉన్నతాధికారి వ్యవహారం కూడా షాడో నేతలు చెబితే పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రమోషన్ దక్కిందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు ట్యాంక్ బండ్‌పై కోట్లు విలువ చేసే పార్కింగ్ దందాలోనూ సదరు ఉన్నతాధికారి పాత్ర ఉందని తెలిసింది. తాజాగా ప్లానింగ్ విభాగంలో కీలకమైన ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ విషయంలోనూ ఈ ఇద్దరూ అధికారుల చేతుల్లో వ్యవహారం జరిగినట్లు సమాచారం.



### షాడో నేతల కీలుబొమ్మలు ఉన్నతాధికారులు..

హెచ్‌ఎండీఏకు ఆదాయాన్ని సమకూర్చే వాటిలో ప్రధానమైనది ప్లానింగ్ విభాగం. ఇవాళ హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ కేంద్రీకృతమై, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తుందంటేనే దానికి ప్లానింగ్ విభాగమే కారణం. దీంతో హెచ్‌ఎండీఏను గుప్పిట్లో పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ఇద్దరు ఉన్నతాధికారులకు హెచ్‌ఎండీఏను ప్రభుత్వం కట్టబెట్టింది. వీరినే తోలుబొమ్మలుగా చేసుకుని తమకు కావాల్సిన వ్యవహారాలను చక్కబెట్టేస్తున్నారని, అందులో భాగంగానే తాజాగా ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. అయితే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు క్లియరెన్స్ ఇస్తే హెచ్‌ఎండీఏకు ఆదాయం సమకూరినా... తమ ఖాతాల్లోకి వచ్చే అవకాశం లేకపోవడంతోనే ఫైళ్ల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారని, బేరం కుదిరితే మోక్ష ద్వారాలు తెరుచుకుంటాయంటూ హెచ్‌ఎండీఏ అధికారులు చర్చించుకుంటున్నారు.

## • 2,98,374 కుటుంబాల్లో సర్వే పూర్తి..

సిటీబ్యూరో, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వేలో భాగంగా జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా నాలుగు రోజుల వ్యవధిలో 2,98,374 కుటుంబాలు సర్వే పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. సోమవారం నాటికి 1,58, 150 కుటుంబాలు కాగా.. మంగళవారం 1,40,224 కుటుంబాల్లో సర్వే చేపట్టినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ కో ఆర్డినేటర్ అధికారిగా హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సర్వే పూర్తయిన వెంటనే వివరాలు డేటా ఎంట్రీ సర్కిల్ స్థాయిలో చేసేందుకు ఏజెన్సీని గుర్తించారు. ఫారాలను భద్రపరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. డేటా ఎంట్రీ అయిన ఫారాలు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాల ని అధికారులకు ఆదేశాలు చేశారు.






# స్మార్ట్ కార్డుల కొరత

సిటీబ్యూరో, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు నిర్ణీత సమయంలో అందడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఆర్టీఏలో స్మార్ట్ కార్డుల కొరత ఉండటంతో కార్డులు అందడానికి రెండు వారాలకు మించి సమయం పడుతుందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో చిరునామాకు లైసెన్స్‌లు, ఆర్‌సీలు చేర్చాల్సిన అధికారులు స్మార్ట్ కార్డుల కొరతతో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. లైసెన్స్‌లు, ఆర్‌సీ కార్డుల జారీకి వాహనదారుల నుంచి ముందుగానే ఫీజు కట్టించుకుంటారు. కానీ కార్డులు జారీ చేయడానికి మాత్రం జాప్యం చేస్తున్నారు. గ్రేటర్‌లోని అన్నీ ఆర్టీఏ కార్యాలయాల్లో ఇదే సమస్య ఉన్నట్టు వాహనదారులు చెబుతున్నారు. ప్రింటర్, రెబ్బన్, కార్డులతో లైసెన్స్‌లు, ఆర్‌సీలు తయారవుతాయి. ఆ కార్డులను కవర్‌లో ప్యాక్ చేసి .. కొరియర్‌పై పోస్టల్ స్టాంప్స్ అతికించి వాహనదారుడి ఇంటికి పంపిస్తారు. ఈ ప్రక్రియ వారానికి మించి ఉండదు. కానీ స్మార్ట్ కార్డుల కొరతతో అంతకు మించి సమయం పడుతుండటంపై వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# దరఖాస్తు సరే.. ఎంపికెప్పుడు?

### ఏకపక్షంగా ఇందిరమ్మ కమిటీలు

### జిల్లా వ్యాప్తంగా లక్షా10 వేల దరఖాస్తులు

### ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

మేడ్చల్, నవంబర్12 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడంటూ దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా ఇందిరమ్మ ఇంటి పథకానికి దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఇప్పటి వరకు పథకం లబ్ధిదారుల ఎంపిక మాత్రం జరగడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఇందిరమ్మ పథకానికి సంబంధించి 1,10,436 దరఖాస్తులు వచ్చాయి. కాగా నియోజకవర్గానికి 3500 చొప్పున 5 నియోజకవర్గాలకు 17,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విధితమే.

### ఏకపక్షంగా ఇందిరమ్మ కమిటీల నియామకం..

ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అధికారులతో పాటు ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. అయితే ఈ కమిటీల నియామకాల్లో కాంగ్రెస్ పార్టీ వారినే నియమించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందిరమ్మ కమిటీ సభ్యులు పారదర్శకంగా వ్యహరించే అవకాశం లేదని దీంతో అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం వర్తించే అవకాశం లేకుండా పోతుందన్న ఆందోళనను దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గానికి 3500 మందిని మాత్రమే పథకానికి ఎంపిక చేస్తే మరి.. మిగతా వారి పరిస్థితి ఏమిటి అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇంటి స్థలం ఉన్న వారికి రూ. 5 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చింది. కాగా ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు ప్రారంభం అవుతుందన్న విషయంపై ఇప్పటి వరకు అధికారులకు ఎలాంటి క్లారిటీ లేదని తెలుస్తోంది.




# ఇండ్లలోకి కోతులు

### వీధి కుక్కలే కాదు కోతులతోనూ ఇబ్బందులే..

### జీహెచ్‌ఎంసీకి బాధితుల మొర

### కోతులను అటవీ ప్రాంతానికి తరలించేందుకు సవాల్‌గా మారిన ప్రక్రియ

### శాశ్వత పరిష్కారం చూపండి : నగరవాసులు

సిటీబ్యూరో, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వీధి కుక్కల బెడదతో పాటు కోతుల సమస్య జీహెచ్‌ఎంసీకి తలనొప్పిగా మారింది. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లే.. కోతుల బెడద నుంచి రక్షించాలని బాధితులు ఇటీవల బల్దియా టోల్ ఫ్రీ నంబర్‌కు, చార్మినార్ జోన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారు. తలుపులు తెరిచినప్పుడు, కిటికీల ద్వారా ఇళ్లలోకి చేరి గదుల్లోని సామగ్రిని చిందర వందర చేయడం, మనుషులపై దాడి చేయడం జరుగుతుందని, దేవాలయాల వద్ద కొబ్బరి చిప్పలు, అరటి పండ్ల వంటి వాటికోసం పైకి ఎగబడి భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. కోతులతో విసిగిపోతున్నట్లు ప్రజల నుంచి జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు రావడం, వీటికి శాశ్వత చెక్ పెట్టడంలో జీహెచ్‌ఎంసీ అధికారులకు సవాల్‌గా మారింది. అధిక శాతం ఈస్ట్ మారేడ్‌పల్లి, వెస్ట్‌మారేడ్‌పల్లి, పద్మారావునగర్, సికింద్రాబాద్, అల్వాల్, ఉప్పల్, తార్నాక, అమీర్‌పేట, కాప్రా, డీబీఆర్ మిల్స్, టెలికాం నగర్, కోఠి, నల్లకుంట తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి వస్తున్న కోతులతో ప్రజలు.. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు భయంతో వణికిపోతున్నారు. అధికారులు జోన్ల వారీగా కోతులను నగరం నుంచి అటవీ ప్రాంతానికి తరలించేందుకు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. ఇందుకు కారణం నిబంధనలు కఠినంగా ఉండటమే. కోతికి ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తగా పట్టుకునే నైపుణ్యం ఉన్న సిబ్బంది లేకపోవడమే. కాగా ఢిల్లీ తదితర మెట్రో నగరాల్లో కోతులను పట్టుకునే నైపుణ్యమున్న ఏజెన్సీలకు ఒక్కో కోతికి రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు చెల్లిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ గరిష్టంగా రూ.1800 చెల్లించేందుకు మాత్రమే టెండర్ పెడుతుండటం, ఈ ధర గిట్టుబాటు కాకపోవడంతో ఎవరూ ముందుకు రావడం లేదని పేర్కొంటున్నారు. కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.





## చెత్త శుద్ధి ఇదేనా?

అధికారులు తడి, పొడి చెత్త పై అవగాహన కల్పించి.. స్వచ్ఛ వాహనాలకు అందించాలని సూచిస్తున్నా కొంతమంది మాత్రం నిర్లక్ష్యంగా చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. నగరంలోని పద్మారావునగర్ రోడ్డు పక్కన పడేసిన చెత్తతో అటుగా వెళ్లే వారు.. దాని నుంచి వచ్చే దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.